ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

అద్దె భవనాల్లో 'అంగన్వాడీలు'

- ఇరుకు గదులు, వసతులు శూన్యం..
- ఇబ్బందుల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు
- మధ్యలోనే నిలిచిపోయిన నూతన భవనాల నిర్మాణ పనులు

బావి భారత పౌరులకు పౌష్టికాహార లోపం లేకుండా ఉండేందుకు చిన్నారులకు, గర్భిణులకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంగన్వాడీ కేంద్రాలు సమస్యలకు నిలయంగా మారాయి. గ్రామాల్లో, పట్టణాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు అద్దె భవనాలే దిక్కవుతున్నాయి. అద్దె భవనాల్లో ఇరుకైన గదిలో సరైన సౌకర్యాలు, వెలుతురు లేమితో కొనసాగుతున్నాయి.

ప్రజాశక్తి - కోడుమూరు

కోడుమూరు మండలంలో 21 గ్రామాల్లో 78 అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయి. ఇందులో 20 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 5 ఇతర ప్రభుత్వ భవనాలలో నడుస్తున్నాయి. మిగతా 48 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాలకు ప్రభుత్వం చేపట్టిన భవన నిర్మాణాలు అసంపూర్తిగా మధ్యలోనే నిలిచిపోయాయి. నాబార్డ్, ఎంజిఎన్ఆర్ఇజిఎ, మహిళ శిశు సంక్షేమ శాఖ నిధులతో చేపట్టిన భవనాల నిర్మాణాలు పంచాయతీరాజ్, హౌసింగ్ శాఖల పర్యవేక్షణలో ఆలస్యం కారణంగా అసంపూర్తిగా మిగిలాయి. అధికారుల అలసత్వం, తగినంత నిధులు లేనందున నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి.

మౌలిక వసతులు కరువు

అద్దె గృహాల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో వసతులు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులకు గురవుతున్నారు. అద్దె గదిలోనే వంట సామాగ్రి, వడ్డించి పెట్టడం, చిన్నారులకు విద్య అందించడం వంటి పనులన్నీ ఒకే చోట నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. దీనికి తోడు మూత్రశాలల సౌకర్యాలు, నీటి వసతి సౌకర్యాలు, పారిశుధ్యం లేక నానా అవస్థలు పడుతున్నారు. అద్దె భవనాల్లో అంగన్వాడీ కేంద్రాలను నడపడం వలన సరైన గాలి, వెలుతురు సరిగ్గా ఉండడం లేదు. కనీస సౌకర్యాలు లేని ఇరుకైన అద్దె గదుల్లోని కేంద్రాలకు వెళ్లేందుకు కొందరు నిరాకరిస్తున్నారు. అద్దె భవనాలను తరచుగా మార్చడం వలన గర్భిణీలు, చిన్నపిల్లలకు అసౌకర్యంగా మారుతోంది. అలాగే కోడుమూరు ఐసిడిఎస్ పరిధిలో 1 అంగన్వాడీ కార్యకర్త, 8 అంగన్వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అంగన్వాడీ టీచర్లపైనే అద్దె భారం

గత కొన్ని నెలలుగా అంగన్వాడీ కేంద్రాలకు అద్దె చెల్లించకపోవడంతో అద్దె భారం టీచర్లపైనే పడుతోంది. అద్దె చెల్లించాలని యజమానుల నుంచి ఒత్తిడి వస్తుండడంతో అంగన్వాడీ టీచర్లే సొంత డబ్బులు వేసుకుని చెల్లిస్తున్న పరిస్థితి నెలకొంది. అద్దె బారం టీచర్లకు పడకుండా గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన అంగన్వాడీలను, అసంపూర్తి అంగన్వాడీ కేంద్రాలను గుర్తించి వాటి స్థానంలో నూతన భవనాలను నిర్మించి, అంగన్వాడీ సిబ్బంది ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

పిల్లర్లకే పరిమితమైన అమడగుంట్ల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం

మంత్రి లోకేష్ ఆదేశించినా కదలని అధికారులు

నూతన భవనాల నిర్మాణాలకు గత వైసిపి ప్రభుత్వం బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో నిర్మాణాలు కొన్ని చోట్ల మధ్యలోనే ఆగాయి. దీంతో నిర్మాణ పనులు పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి భవనాలను పూర్తి చేయాలని జిల్లా అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. కానీ ఆచరణలో మాత్రం ముందుకు సాగడం లేదు.

త్వరలో పనులు మొదలయ్యే అవకాశం

కోడుమూరు ఐసిడిఎస్ పరిధిలో ఉన్న అసంపూర్తి భవనాలను, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి సంబంధిత శాఖకు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

- వరలక్ష్మి దేవమ్మ సిడిపిఒ, ఐసిడిఎస్, కోడుమూరు.

పిల్లర్లకే పరిమితమైన పనులు

గత ఆరు సంవత్సరాల నుంచి అంగన్వాడీ కేంద్రం కేవలం పిల్లర్లకే మరిమితమై అసంపూర్తిగానే ఉంది. అధికారులు, నాయకులు చొరవ తీసుకొని అంగన్వాడీ భవనాలను పూర్తి చేయాలి.

- మిన్నమ్మ, అమడగుంట్ల గ్రామం.

సొంతభవనాలు నిర్మించాలి

అద్దె భవనాలలో అంగన్వాడీ కేంద్రాలు కొనసాగడం వలన అంగన్వాడీ కేంద్రం మారిన ప్రతిసారి వ్యయప్రయాసలు పడు తున్నారు. ఇరుకైన గదులు, పిల్లలు ఆడుకోవడానికి తగినంత స్థలం ఉండదు. ఇరుకైన అద్దె భవనాలు ఉండడం వల్ల చిన్నపిల్లలకు అంటు వ్యాధులు సోకే అవకాశం ఎక్కువగా ఉన్నందున సొంత భవనాలను నిర్మించాలి.

- సుంకులమ్మ, అమడగుంట్ల గ్రామం.

నకిలీ మందులను అరికట్టాలి

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- నూతన ఔషధ నియంత్రణ శాఖ భవనాలు, లేబరేటరీలు వర్చువల్‌గా ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

నకిలీ మందులను అరికట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడ నుండి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కర్నూలు, విశాఖపట్నం రీజనల్ లేబరేటరీలను, 9 డిప్యూటీ డైరెక్టర్, ఏడి కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ నూతన భవనాలను, లేబరేటరీలను ఏర్పాటు చేశారని, వీటి ద్వారా మందులను పరీక్షించి, అనవసర మందులు, నకిలీ మందులు నియంత్రించి ప్రజలకు మంచి ఆరోగ్య సేవలు అందుతాయని మంత్రి తెలిపారు. అనంతరం కర్నూలులో స్థానిక ఎపిఎంఎస్ ఐడిసి సమీపంలో నూతనంగా రూ.2.78 కోట్లతో నిర్మించిన డిప్యూటీ డైరెక్టర్, డ్రగ్స్ కంట్రోల్, రీజనల్ లేబరేటరీ భవనాలను ఫిజికల్‌గా జిల్లా కలెక్టర్ ఎ.సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఔషధ దుకాణాల యజమానులతో మాట్లాడుతూ దుకాణాలలో నకిలీ మందులను, కాలం చెల్లిన మందులను అమ్మరాదన్నారు. ప్రజలు యాంటీ బయాటిక్స్‌ను అధిక మోతాదులో ఇష్టానుసారం వాడుతున్నారని, వాటిని డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేనిదే అమ్మరాదని సూచించారు. వైద్యులు ఇచ్చిన ప్రిస్క్రిప్షన్‌ల ద్వారానే మందులను ప్రజలకు అందించాలని కోరారు. మరి కొద్ది రోజుల్లో ఈ లేబరేటరీకి ఇంకా అత్యాధునిక పరికరాలు వస్తాయని తెలిపారు. ఇక్కడకు అన్ని జిల్లాల నుండి వచ్చే మందులను పరీక్షించి, నకిలీ మందులు, కాలం చెల్లిన మందుల వివరాలు ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పాణ్యం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి అన్ని విధాల కృషి చేస్తుందన్నారు. పేద ప్రజలకు 25 లక్షల రూపాయల వరకు వైద్యంను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. అనంతరం లాబరేటరీలో పరికరాలను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. అవి ఏ విధంగా వినియోగిస్తారు, వాటి వల్ల ఉపయోగాలను టెక్నిషియన్లు, అధికారులు వివరించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ భాస్కర్, డిసిహెచ్ఎస్ జఫ్రుల్లా, డిప్యూటీ డైరెక్టర్ డ్రగ్ కంట్రోల్ నాగ కిరణ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ హరిహర తేజ, డ్రగ్ ఇన్స్పెక్టర్ హనుమన్న, జయరాముడు, ఎపిఎంఎస్ ఐడిసి ఈఈ చిరంజీవులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారిగా సుధాకర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సుధాకర్

కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారిగా సుధాకర్‌ను నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం జిల్లాలోని భీమునిపట్నంలో డైట్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇక్కడ జిల్లా విద్యాశాఖ అధికారిగా పని చేస్తున్న ఎస్.శామ్యూల్ పాల్‌ను డిఈవో అదనపు బాధ్యతల నుండి తొలగిస్తూ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కొనసాగుతారని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

పిల్లల్లో నైపుణ్యాలను వెలికితీసేది బాలోత్సవం

- ప్రారంభ సభలో వక్తలు - అట్టహాసంగా కర్నూలు బాలోత్సవం ప్రారంభం

మాట్లాడుతున్న బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి.పుల్లయ్య

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి / కలెక్టరేట్

పిల్లల్లో నైపుణ్యాలను వెలికితీసేది బాలోత్సమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు నగర శివార్లలోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో 5వ కర్నూలు బాలోత్సవం అట్టహాసంగా ప్రారంభమైంది. తొలుత బాలోత్సవం జెండాను బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి.పుల్లయ్య ఎగురవేశారు. అనంతరం మాంటిస్సోరి విద్యాసంస్థల వ్యవస్థాపకులు కల్యాణమ్మ, బాలోత్సవం పూర్వ గౌరవాధ్యక్షులు జెఎన్ శేషయ్య చిత్రపటాలకు నివాళులు అర్పించారు. అనంతరం బాలోత్సవం అధ్యక్షులు జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభలో బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి పుల్లయ్య మాట్లాడారు. తరగతి గదిలోని చదువు పరీక్షల కోసం, జ్ఞానం కోసం పనికొస్తుందని, ప్రపంచాన్ని చదవాలంటే మనుషులతో కలవాలని, ఇలాంటి ఉత్సవాలు అలాంటి అవకాశాలను కల్పిస్తాయని చెప్పారు. నైపుణ్యాలను పెంచుకోవడానికి ఈ బాలోత్సవాలు ఉపయోగపడతాయన్నారు. పిల్లలు వాళ్ళలో ఉన్న నైపుణ్యాన్ని పెంచుకోవడానికి కృషి చేయాలన్నారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి.శంకర శర్మ మాట్లాడుతూ సెల్‌ఫోన్ భూతానికి పిల్లలు బలైపోతున్నారన్నారు. బాలోత్సవం వల్ల పిల్లలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించవచ్చని, సృజనాత్మకతను బయటకు తీయవచ్చని తెలిపారు. వనపర్తి ప్రజా వైద్యశాల వైద్యులు డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ పండగ వాతావరణంలో ఈ బాలోత్సవం జరుగుతోందని, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం స్ఫూర్తితో వనపర్తిలోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ కళలకు ప్రాచీన చరిత్ర ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల్లో ఈ బాలోత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో ఆలోచించే శక్తిని, నైపుణ్యాన్ని పెంచుతాయన్నారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయ మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు సామాజిక అంశాలను నేర్పించాలనేదే బాలోత్సవం లక్ష్యమన్నారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు, సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందరి మద్దతుతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. మాంటిస్సోరి ఇండస్ పాఠశాల ప్రిన్సిపల్ మీనాక్షి విల్సన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనేందుకు అనుమతి ఇచ్చిన తల్లిదండ్రులకు విద్యార్థులు ధన్యవాదాలు చెప్పాలన్నారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడంతో ప్రారంభ సభ ముగిసింది. సమావేశంలో క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ అక్తర్ భాను, ప్రైవేటు విద్యాసంస్థల గౌరవాధ్యకులు పిబివి సుబ్బయ్య, ప్రవేట్ విద్యాసంస్థల జిల్లా అధ్యక్షులు వాసుదేవ రెడ్డి, శ్రీలక్ష్మి పాఠశాల డైరెక్టర్ దీక్షిత్, మాంటిస్సోరి విద్యాసంస్థల సీఈవో విల్సన్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహ, బాలోత్సవం కోశాధికారి జె.రంగస్వామి, ఉపాధ్యకులు ఎంసివి రమణారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలోత్సవం జెండాను ఎగురవేస్తున్న జి.పుల్లయ్య

ఉత్సాహంగా సాగిన పోటీలు.. : బాలోత్సవంలో భాగంగా తొలి రోజు పోటీలు ఉత్సాహంగా సాగాయి. విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, కథా రచన, కవితా రచన, పద్య భావం, వార్తారచన, మ్యాప్ పాయింటింగ్, వినతి పత్రం రాయడం, స్పెల్ బి పోటీలు నిర్వహించారు. శాస్త్రీయ నృత్యం, ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాలాపన, జానపద గీతాలాపన, లఘునాటికలు, విచిత్ర వేషధారణ పోటీల్లో విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి.

నేటి కార్యక్రమాలు ఇలా.. : బాలోత్సవంలో భాగంగా రెండో రోజు బుధవారం చిత్రలేఖనం, కథ చెప్పడం, తెలుగులో మాట్లాడటం, కార్టూన్ వేయడం, రైమ్స్ చెప్పడం, జానపద నృత్యాలు, కోలాటం, సంగీత వాయిద్య ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ శంకర్ శర్మ

ఆకట్టుకున్న బాలికల నృత్య ప్రదర్శన

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి కబర్ధి

స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వికలాంగుల పట్ల స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి తెలిపారు. మంగళవారం నగరంలోని దామోదరం సంజీవయ్య మున్సిపల్ స్మారక పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కబర్ధి, డిఇఒ శామ్యూల్ పాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కబర్ధి మాట్లాడారు. వికలాంగ పిల్లలు న్యాయపరమైన సేవలు, హక్కులు, నిపుణులైన న్యాయ నిపుణుల సహాయాన్ని పొందేలా చూడాలన్నారు. అనంతరం కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి మాట్లాడుతూ... లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, పిల్లల హెల్ప్ లైన్ నెంబర్ 1098 గురించి వివరించారు. వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌లో పిల్లలందరికీ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. డిఎంహెచ్ఒ భాస్కర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబశివ రావు, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, గవర్నమెంట్ అబ్జర్వేషన్ హోం సూపరింటెండెంట్ హుస్సేన్ బాష, లీగల్ సర్వీసెస్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

టిడిపిలోకి వైసిపి నాయకులు

ప్రజాశక్తి - సి బెళగల్

మారందొడ్డి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు మాజీ సర్పంచి రుక్మాంగద రావు కుటుంబీకులు, ఆయన గ్రూపు, అభిమానులు సుమారు 250 మంది మంగళవారం టిడిపిలో చేరారు. సొసైటీ జిల్లా ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో కర్నూలులోని నివాసంలో పార్టీలో చేరి విష్ణువర్ధన్ రెడ్డి నాయకత్వం మెచ్చి వైసిపిని వీడినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - మద్దికేర

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా నాయకులు నాగరాజు తెలిపారు. మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో పెరవలి జడ్‌పిహెచ్ స్కూల్‌లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ముఖ్య అతిథులుగా ఎంఇఒ రంగస్వామి, రంగస్వామి టెంపుల్ ఛైర్మన్ రవికుమార్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ... పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందజేసేందుకు ప్రముఖ విద్యా ప్రదాత రవికుమార్ రూ.10 వేల సహాయం చేసినట్లు తెలిపారు. 95 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఎంఇఒ మాట్లాడుతూ... వంద రోజుల ప్రణాళికపై అవగాహన కల్పించి, ఉన్నత మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎంజి.నాగరాజు, ఎం.విశ్వనాథ్, పాండు పాల్గొన్నారు.

ప్రధాని సభలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలి

- బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్, పిపిఎస్ఎస్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

గత అక్టోబర్ 16న ప్రధానమంత్రి సభల కోసం వేసిన రోడ్ల దోపిడీపై విచారణ చేపట్టాలని బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యాకోబ్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఈ.పుల్లారెడ్డి, ఎ.వెంకటేశ్వర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి టి.మద్దిలేటి, కె.షమీర్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రధాని సభల రోడ్ల దోపిడీపై విచారణ జరిపి ప్రజాధనాన్ని కాపాడాలని, మిగిలిన కంకరతో రోడ్లు లేని శివారు కాలనీలో రోడ్లు వేయాలని కోరుతూ పిపిఎస్ఎస్, ఇతర సంఘాలతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కర్నూలు సమీపంలో ప్రధాని సభల కోసం రూ.కోట్లు వెచ్చించి వేసిన కొన్ని తారు రోడ్లు కుంగిపోతున్నాయని, కొన్ని రోడ్లపై వేసిన ఖరీదైన మిక్సింగ్ కంకర ఎత్తుకు పోతున్నా సంబంధిత శాఖ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రూ.13 కోట్లతో గత ప్రభుత్వం చివర్లో నాసిరకంగా వేసిన పెద్దపాడు తారు రోడ్డులో జరిగిన దోపిడీలాగే ప్రధానమంత్రి సభల రోడ్ల దోపిడీని కూడా దాచి పెడుతున్నట్లు కనిపిస్తుందన్నారు. రోడ్ల దోపిడీపై అధికార పక్షం స్పందించడం లేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం స్పందించి రోడ్ల దోపిడీపై సమగ్ర విచారణ జరిపి నిందితులను శిక్షించి ప్రజాధనాన్ని కాపాడాలని కోరారు. మహ్మద్ యూనుస్, ఎన్.శ్రీనివాసరెడ్డి, ఎస్.అన్వర్ బాష, ఎన్.మద్దిలేటి, ఎస్.అయూబ్, పి.మురళీ పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు సత్యనారాయణ మృతి

ప్రజాశక్తి- కోడుమూరు

నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం మాజీ సీనియర్ నాయకులు మిస్కిన్ సత్యనారాయణ అనారోగ్యం, వయస్సు మీదపడడంతో మృతి చెందారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.రామకృష్ణ, మండల కార్యదర్శి కె.రాజు, సిఐటియు మండల కార్యదర్శి గఫూర్ మియ, మండల అధ్యక్షులు జిపి.వీరన్న, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మన్న, మల్లికార్జునలు సత్యనారాయణ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ... సత్యనారాయణ పార్టీకి ఏళ్ల తరబడి ఎనలేని సేవలు చేశారని, బెళగల్, కోడుమూరు మండలాల్లో కార్మికులు, రైతులు, పేదల కోసం పని చేశారని తెలిపారు.

మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణను రద్దు చేయాలి : మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి - పత్తికొండ

పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను రద్దు చేయాలని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ధ్వజమెత్తారు. మంగళవారం పట్టణంలోని స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే మెడికల్ కాలేజీలను ప్రయివేట్ పరం చేస్తోందని విమర్శించారు. ప్రయివేటీకరణ చేయడం వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరమవుతూ వైద్య సేవలు అందని ద్రాక్షగా మారుతాయని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 62 వేల సంతకాలు చేయించామన్నారు. ఎంపిపి నారాయణ దాసు, రాష్ట్ర నాయకులు శ్రీరంగడు, సోమశేఖర్, బాబుల్ రెడ్డి, శ్రీనివాసులు, ఎర్రగుడి రామచంద్రారెడ్డి, బాబుల్ రెడ్డి, సర్పంచులు ప్రభాకర్ రెడ్డి, కేశవరెడ్డి, రహిమాన్, మండల కన్వీనర్ కారం నాగరాజు, పెద్దహుల్తి నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మద్యం, మత్తు పదార్థాలను అరికట్టాలి

- ఐద్వా నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మద్యం, మత్తు పదార్థాలను అరికట్టి మహిళల మాన, ప్రాణాలను కాపాడాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అరుణ డిమాండ్ చేశారు. మహిళలు, పసి పిల్లలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని మంగళవారం 37వ వార్డులోని నేతాజీ హౌసింగ్ కాలనీ ప్రాథమిక కమిటీ ఆధ్వర్యంలో కమిటీ కన్వీనర్ సి.రేవతి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్య ఆహ్వానితులుగా కె.అరుణ, ఐద్వా కోశాధికారి పిఎస్.సుజాత, సహాయ కార్యదర్శి బి.పద్మలు మాట్లాడుతూ... మద్యం, మత్తు పదార్థాలను గుడి, బడి అనే తేడా లేకుండా ఎక్కడికక్కడ అమ్ముతున్నా చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. ఐద్వా రాష్ట్ర నాయకులు ఎన్.అలివేలు, ప్రాథమిక కమిటీ గౌరవాధ్యక్షులు కె.పద్మావతి, కమిటీ సభ్యులు జె.గోవర్ధనమ్మ, సుకన్య, భాగ్యమ్మ, మాసుంబీ, చెన్నమ్మ పాల్గొన్నారు.

42 మోటార్ సైకిళ్లు రికవరీ

- నిందితుని అరెస్టు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

నిందితుని అరెస్టు చేసి, 42 మోటార్ సైకిళ్లను కర్నూలు త్రీ టౌన్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పోలీసు స్టేషన్‌లో సిఐ శేషయ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... కర్నూలు ప్రభుత్వాస్పత్రిలోని గైనిక్ వార్డు వద్ద పార్కు చేసి ఉన్న మోటార్ బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో దొంగిలించారని గత నెల 9న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అదే ప్రాంతంలో పదే పదే మోటార్ సైకిళ్లు దొంగతనానికి గురవుతున్నాయని, ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అనంతపురం జిల్లాకు చెందిన జాకబ్ అనే వ్యక్తి మంగళవారం కర్నూలు, అరుంధతి నగర్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. అరుంధతి నగర్‌లో దొంగిలిచ్చిన వాహనాలను కంపచెట్లలో దాచి ఉంచినట్లు తెలపడంతో అక్కడికి వెళ్లి 42 మోటార్ వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మరికొన్ని కేసులు కూడా అతనిపై నమోదై ఉన్నాయన్నారు. నిందితుడు దొంగిలించిన వాహనాలను ఇతర రాష్ట్రాల్లో అమ్మి సొమ్ము చేసుకొని జల్సాలకు అలవాటు పడ్డాడన్నారు. కర్నూలు త్రీ టౌన్ ఎస్ఐ ఆశాలత, ఎస్ఐ ఈ.గిడ్డయ్య గౌడ్, హెచ్‌సి శ్రీనివాసులు (వాసు), రంగారావు, చెంచన్న, ఎస్.సుంకన్న, కానిస్టేబుల్స్ శేఖర్, నాగరాజు, చంద్రబాబు నాయుడు, నాగేశ్వర రావు, కిశోర్, పాండు నాయక్, ముజఫర్ రహిమాన్, తిరుమలేష్ సంతోష్‌ను డీఎస్పీ అభినందించారు.

మాట్లాడుతున్న సిఐ శేషయ్య

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

ప్రసూతి మరణాలను తగ్గించాలి

- కలెక్టర్ సిరి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రసూతి మరణాలను పూర్తిగా తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో వైద్య శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... వైద్య శాఖకు సంబంధించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ అమలులో వంద శాతం పురోగతి సాధించాలని ఆదేశించారు. జిల్లాలో గర్భిణులకు అందించే యాంటీ నేటల్ కేర్ సేవలు తప్పనిసరిగా వందశాతం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గర్భిణీనీ నమోదు చేసి, నిర్ణీత కాలపట్టిక ప్రకారం సకాలంలో ఆరోగ్య పరీక్షలు, అవసరమైన రక్త పరీక్షలు, హీమోగ్లోబిన్ స్థాయి, బీపీ, బరువు, టీకాలు, పోషకాహారానికి సంబంధించిన సేవలు అందించాలని తెలిపారు. శిశు మరణాల శాతాన్ని కూడా పూర్తిగా తగ్గించాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఫేషియల్ రికగ్నైజేషన్‌కు సంబంధించి వంద శాతం అటెండెన్స్ ఉండాలని ఆదేశించారు. సిపిఒ భారతి, డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్ రాజు, డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, ప్రభుత్వాస్పత్రి ఎఒ సింధు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన 'కూటమి'

- వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కూటమి ప్రభుత్వం యువతను అన్ని విధాలుగా మోసం చేసిందని వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, యువ నాయకులు కాటసాని శివ నరసింహారెడ్డి విమర్శించారు. మంగళవారం నగరంలోని హ్యాంగౌట్ హోటల్ కెఎస్ఆర్ కన్వెన్షనల్‌లో 'యువత మేలుకో' నిర్వహించారు. రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని చెప్పి వాలంటీర్ల వ్యవస్థను తొలగించిందని తెలిపారు. తాను చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. నియోజకవర్గంలో ఏ రైతుకూ అన్యాయం జరగకుండా అధికారులతోనూ, మంత్రులతో మాట్లాడి ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధికి కృషి చేశామన్నారు. మేయర్ బివై.రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి

ఆదోని కాటన్ మిల్లులో అగ్నిప్రమాదం

- రూ.2.5 కోట్ల ఆస్తినష్టం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని వన్ టౌన్ పరిధిలోని హరి కాటన్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పత్తి సరఫరా ఆయిల్ బెల్ట్ మోటార్ వద్ద నిప్పు రగిలి మంటలు చెలరేగాయి. గమనించిన యజమాని వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మరింత నష్టాన్ని నివారించగలిగారు. రెండు ఫైరింజన్లతో అగ్ని మాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదానికి విద్యుదాఘాతమే కారణమని, ఈ ఘటనలో సుమారు రూ.2.5 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లినట్లు మిల్లు యజమాని హరిబాబు తెలిపారు. పత్తి కొనుగోలు సమయంలో ఈ ప్రమాదం వల్ల ఆర్థికంగా నష్టపోయామని మిల్ నిర్వాహకుడు బత్తినె కుబేర్‌నాథ్ తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇన్సూరెన్స్ మంజూరు కావాలన్నా సమయం పడుతుందని, తాము నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పత్తి జిన్నింగ్ ఫ్యాక్టరీ యజమానిని ఆదుకోవాలి

- టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి

అగ్ని ప్రమాదం వల్ల నష్టపోయిన హరి జిన్నింగ్ ఫ్యాక్టరీ నిర్వాహకులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి కోరారు. ప్రమాదం జరగడం దురదృష్టకరమని, జిన్నింగ్ కోలుకుంటున్న సమయంలో అగ్ని ప్రమాదం జరగడం వల్ల వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న భూపాల్ చౌదరి

భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యం

- పిఒ వలీ బేగ్

మొక్కలు నాటుతున్న సిబ్బంది

ప్రజాశక్తి - హాలహర్వి

వర్షపు నీటిని సంరక్షించి భూగర్భజలాలను పెంచడమే వాటర్ షెడ్ పథకం ముఖ్య ఉద్దేశమని ప్రాజెక్ట్ ఆఫీసర్ వలీ బేగ్ తెలిపారు. మంగళవారం హాలహర్వి గోవిందమ్మ దేవాలయంలో ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన వాటర్ షెడ్ మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి చెక్ డ్యామ్‌లో శ్రమదానం చేపట్టారు. అనంతరం బస్టాండ్ నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేవాలయంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న నీటి సమస్యలను జల సంరక్షణ పనుల ద్వారా ఎలా అధిగమించవచ్చో వివరించారు. అలాగే ఈ అవకాశం 2026 మార్చి వరకు ఉంటుందని, ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడు నెలలు గడువు పెంచాలని రైతులు కోరారు. ఎంపిడిఒ వరలక్ష్మి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ వాటర్ షెడ్ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని, నీటి వృథాను అరికట్టాలని తెలిపారు. సర్పంచి మల్లికార్జున, జెఇ పురుషోత్తం రెడ్డి, టిఎఇ అండ్ సిబి గోవిందప్ప, టిఎ రమేష్, టిడిపి నాయకులు శ్రీధర్, నాగప్ప, కుబేర్, పంపాపతి, రంగముని, హనుమప్ప పాల్గొన్నారు.

'బొలెరో గూడ్స్ వెహికల్' కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కోసిగి

బొలెరో గూడ్స్ వెహికల్ (సిఐటియు) మండల యూనియన్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కె.రాముడు, అధ్యక్షులుగా తిమ్మప్ప, ఉపాధ్యక్షులుగా పి.ఈరన్న, మమ్మద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా కిందిగేరి వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా రామాంజి, కుర్ని శ్రీనివాసులు, కోశాధికారిగా షేక్షావలీ, కమిటీ సభ్యులుగా ఉప్పర నరసింహులు, గుడ్డే గిరి ఈరేష్, చింతకుంట వీరేష్, ఆరెవెల్లి హనుమంతు, హరిశ్చంద్ర, వీరేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా నాయకులు ప్రభాకర్, రాధాకృష్ణ హాజరయి మాట్లాడారు. కార్మిక సమస్యలపై సిఐటియు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. రైతుసంఘం మండల కార్యదర్శి వీరేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

బస్సు వచ్చే వరకూ నిలబడాల్సిందేనా..?

- కూర్చోవడానికి, నిలబడడానికి వీల్లేని పరిస్థితి

- బస్టాండ్ భవనం లేకనే ఈ దుస్థితి - పాఠశాలల విద్యార్థులకు ఇబ్బందులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి బస్టాండ్ వద్ద బస్సు వచ్చే వరకు నిలబడి ఉండాల్సిన పరిస్థితి ఉంది. బస్టాండ్ భవనం లేకపోవడంతో కూర్చోవడానికి, కనీసం నిలబడడానికి కూడా వసతి లేదు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, పనుల మీద చిప్పగిరికి వచ్చే ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

చిప్పగిరి బస్టాండ్ దగ్గర నిలుచున్న విద్యార్థులు

చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల నుంచి బస్సుల్లో వచ్చే విద్యార్థులకు అనేక సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. మండలంలోని ఏరూరు, డేగలపాడు, బంటనహాల్, బెల్డోన, కుందనగుర్తి, నేమకల్లు గ్రామాల నుంచి ఎంతోమంది విద్యార్థులు రోజూ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. పాఠశాలలకు సమయానికి బస్సులు రాకపోవడం ఒక ఎత్తయితే.. పాఠశాలల నుంచి స్థానిక బస్టాండ్ దగ్గరకు వస్తే బస్టాండ్ దగ్గర కనీసం కూర్చోవడానికి కూడా ఇబ్బందిగా ఉంది. బస్టాండ్ భవనం లేకపోవడంతో బస్టాండ్ దగ్గర ఉన్న కాంప్లెక్స్ కట్టల మీద కూర్చొని.. నిలబడి ఉండే పరిస్థితి ఉంది. ఒకానొక సమయంలో కాంప్లెక్స్ యజమానులు వ్యాపారాలకు ఇబ్బందిగా ఉన్నా అలాగే ఉండాల్సిన దుస్థితి ఉంది. సాయంత్రం బస్సులు సమయానికి రాలేకపోగా.. వచ్చే వరకు బస్టాండ్ సర్కిల్‌లో నిలబడాల్సిన పరిస్థితి ఉంది. బస్టాండ్ సర్కిల్‌లో కనీసం తాగడానికి నీరు కూడా దొరకని పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు తమ కళ్లారా చూస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. చిప్పగిరి బస్టాండ్ దగ్గర ప్రయాణికులు కూర్చోవడానికి బస్టాండ్ భవనం నిర్మించాలని విద్యార్థులతో పాటు మండలానికి వచ్చే ప్రజలు కోరుతున్నారు.

సమయానికి బస్సు రావడం లేదు

- రేష్మ, విద్యార్థిని

రోజూ చిప్పగిరికి బస్సులో వస్తున్నాం. తిరిగి వెళ్లేప్పుడు సమయానికి బస్సులు రావడం లేదు. బస్టాండ్ దగ్గర కనీసం కూర్చోవడానికి బస్టాండ్ భవనం కూడా లేకపోవడంతో బస్సు వచ్చే వరకు నిలబడి ఉండే పరిస్థితి ఉంది. విద్యార్థులందరూ ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ దగ్గర బస్టాండ్ భవనం నిర్మిస్తే బాగుంటుంది.

ఎస్సీ కాలనీలో వీధిలైట్లు వేయాలి

- సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి ఎస్సీ కాలనీలో వీధి లైట్లు వేయాలని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, నాయకులు కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్సీ కాలనీవాసులతో సంతకాలు చేయించి ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత రెండు నెలల నుంచి ఎస్సీ కాలనీలో వీధిలైట్లు పడకపోవడం వల్ల కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రెండు నెలల నుంచి వీధిలైట్లు వేయకపోవడం పంచాయతీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని, పంచాయతీ, విద్యుత్ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ఎస్సీ కాలనీ సమస్య పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాలనీలో సరయిన సిసి రోడ్లు, డ్రెయినేజీ లేకపోవడం, మురుగునీరు అక్కడే ఉండడం వల్ల దుర్వాసనతో కాలనీ వాసులు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడం, కాలువలను సరిగా శుభ్రం చేయకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పంచాయతీ అధికారులు, సర్పంచి స్పందించి వీధిలైట్లు వేసి, డ్రెయినేజీని శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్సీ కాలనీవాసులతో ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి, సర్పంచి మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు అజయ్, బాలరాజు, నూర్ బాషా పాల్గొన్నారు.

సెక్రటరీ, సర్పంచికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భక్తుల భద్రత, నేరాల నియంత్రణపై దృష్టి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - మంత్రాలయం

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చే భక్తుల భద్రతతో పాటు నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, వివిధ అంశాలపై చర్చించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతిపై ఫైళ్లను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి ఆరా తీశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. పార్కింగ్ ప్రదేశాలను పకడ్బందీగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతకుముందు పోలీసు స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు డీఎస్పీ ఎంఎన్.భార్గవి, డిసిఆర్‌బి సిఐ గుణశేఖర్ బాబు, సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

గ్రామ దేవరకు సంపూర్ణ సహకారం

- శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో జరగనున్న గ్రామ దేవరకు శ్రీమఠం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు తెలిపారు. మంగళవారం పార్టీలకతీతంగా టిడిపి, వైసిపి నాయకులు పీఠాధిపతులను కలిసి దేవర నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రసాద రూపంలో భోజన వసతి కల్పిస్తామని, ఎలాంటి అవసరం వచ్చినా సహాయం చేస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధికి తోడ్పాటునందిస్తామని హామీ ఇచ్చారు. దేవర ఉత్సవాల స్థల పరిశీలన చేసి ఖరారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, వైసిపి మండల ఉపాధ్యక్షులు, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి జి.వెంకటేష్, వైసిపి నాయకులు జనార్ధన్ రెడ్డి, టిడిపి పట్టణ ఇన్‌ఛార్జ్ బి.వరదరాజులు, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, చిన్న సుంకప్ప, వైసిపి నాయకులు శివరామగౌడ్, శివ, బంగి భీమయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

సమరానికి అంగన్వాడీలు సిద్ధం కావాలి

- అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు నిర్మల

ప్రజాశక్తి - ఆదోని

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలతో సమరానికి అంగన్వాడీలు సిద్ధం కావాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు పి.నిర్మల, ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ కోరారు. అంగన్వాడీలకు నెలకు రూ.26 వేలకు వేతనం పెంచాలని ఈనెల 12న చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని గోడపత్రిక విడుదల చేశారు. అంతకుముందు ఆదోని ప్రాజెక్టు అంగన్వాడీల సమావేశం నిర్వహించారు. నాయకులు వరలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పి.నిర్మల, వెంకటమ్మ, సిఐటియు నాయకులు గోపాల్, తిప్పన్న, రామాంజనేయులు, వీరారెడ్డి మాట్లాడారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి, వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. స్థానిక నాయకులు, అధికారులు అంగన్వాడీల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మానుకోకపోతే ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని ఈనెల 12న చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం విశాఖలో జరిగే ఆల్ ఇండియా సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని గోడపత్రికలు, కరపత్రాలు విడుదల చేశారు. సెక్టార్ లీడర్లు సరోజ, పద్మ, గీతా, సోమక్క, రేణుక, లక్ష్మీదేవి, కరుణ, లలిత పాల్గొన్నారు. **ఆలూరు** ప్రాజెక్టు సూపర్‌వైజర్ సీబాకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎ.బాలరంగమ్మ, అంగన్వాడీలు ప్రశాంతి, విశాలాక్షమ్మ పాల్గొన్నారు.

ఆదోనిలో మాట్లాడుతున్న నిర్మల

ఆలూరులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కోటకొండ నుంచి లక్కసాగరం రోడ్డు మంజూరు

- రూ.4.7 కోట్లు కేటాయింపు

- 25 ఏళ్ల ప్రజల సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని పి.కోటకొండ నుంచి లక్కసాగరం గ్రామం వరకు నూతన రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.4.7 కోట్లు మంజూరు చేసినట్లు పికెట్ ఎఇ ఉదయ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ రోడ్డుకు నిధులు కేటాయించడంతో గత 25 ఏళ్ల నుంచి వెల్దుర్తి, క్రిష్ణగిరి, దేవనకొండ మండలాలలోని పలు గ్రామాల ప్రజలు, వాహనాదారుల ఇక్కట్లు తొలగిపోతున్నాయి. అనేక ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఎంపిపి రామచంద్ర నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. గతంలో పని చేసిన పాలకుల దృష్టికి కూడా ప్రజాప్రతినిధులు, నాయకులు తీసుకెళ్లారు. ప్రస్తుత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో కొనసాగుతున్న అన్నదానానికి భక్తుల నుంచి రూ.లక్ష విరాళం వచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కర్ణాటక రాష్ట్రం తుమ్కూర్‌కు చెందిన సి.జయలక్ష్మి, ప్రహ్లాదరావులు స్వామి వారి దర్శనార్థమై మంత్రాలయం వచ్చినట్లు తెలిపారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని.. అనంతరం అన్నదానానికి రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు చెప్పారు. దాతలకు పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు శేష వస్త్రం, ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

13 నుంచి జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో క్రిస్మస్ పండగ సందర్భంగా ఈనెల 13 నుంచి జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెంకీ, రవి, శ్రీనాథ్, శరత్ బాబు, వినయ్ మంగళవారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.1000 ప్రవేశ రుసుం ఈనెల 12లోపు చెల్లించాలని కోరారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి జిల్లా వినియోగదారుల సంఘం సభ్యులు నారాయణరెడ్డి రూ.50,016, రెండో బహుమతి మాజీ సర్పంచి బాట మీద రాజన్న రూ.30,016, మూడో బహుమతి మాజీ ఉప సర్పంచి గిరిబాబు సత్యరాజు రూ.15,016 అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9640774000, 9391194995, 6300520242 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీల విజేత రెయిన్‌బో

ప్రజాశక్తి- దేవనకొండ

ఆదోని పట్టణంలో జరిగిన జిల్లాస్థాయి అండర్ -16 బాలుర కబడ్డీ పోటీల్లో దేవనకొండ రెయిన్‌బో ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచినట్టు పాఠశాల కరస్పాండెంట్ అల్లిపీరా మంగళవారం తెలిపారు. పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణించడం పట్ల ప్రధానోపాధ్యాయులు విశాలాక్షి, రవి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలి

- వైసిపి మండల ఉపాధ్యక్షులు భీమయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం

కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వైసిపి మండల ఉపాధ్యక్షులు, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో వైద్య సేవలందించేందుకు మెడికల్ కాలేజీల నిర్మాణాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దాన్ని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించి పేదల ఆరోగ్యంతో వ్యాపారం చేసేందుకు అనుమతులు ఇవ్వడం బాధాకరమన్నారు. ఈ విషయంపై ఆలోచించాలని కోరారు. ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, నాయకులు జనార్ధన్ రెడ్డి, చాకలి భీమయ్య, బంగి దుళ్లయ్య, బంగి నాగేష్, కురువ శివ పాల్గొన్నారు.

ఆదోని బంద్‌కు మద్దతు ఇవ్వాలి

- జెఎసి నాయకులు

ఉమాపతి నాయుడుతో జెఎసి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లా సాధనకు జెఎసి ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన బంద్‌కు అన్ని వర్గాల ప్రజలూ సహకరించాలని, ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని జెఎసి నాయకులు కోరారు. మంగళవారం టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడును జెఎసి నాయకులు రఘురామయ్య, అశోక్ నంద రెడ్డి, కోదండ, కృష్ణమూర్తి కలిసి చర్చించారు. కార్మిక సంఘాల నాయకులను, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులను కలిసి సంప్రదిస్తున్నామని తెలిపారు. బంద్‌కు టిడిపి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఉమాపతి నాయుడు స్పష్టం చేశారు. తమ నాయకులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామన్నారు. హౌసింగ్ డైరెక్టర్ ఆరెకల్ రామకృష్ణ, నాయకులు శంకర్, రామస్వామి, రంగస్వామి నాయుడు, గోపాల్, అయ్యన్న, మదిరే వీరేష్ ఉన్నారు.

శ్రీమఠంలో హుండీ లెక్కింపు పూర్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో చేపట్టిన హుండీ లెక్కింపు పూర్తయినట్లు శ్రీమఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. స్వామి వారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కానుకల రూపంలో నవంబర్, డిసెంబర్‌లో హుండీలో వేసిన 21 రోజుల ఆదాయాన్ని దేవదాయ, శ్రీమఠం అధికారులు సేవాదారులతో కలిసి లెక్కింపు చేపట్టామని పేర్కొన్నారు. నగదు రూపంలో రూ.3,06,81,661, బంగారం 23 గ్రాములు, వెండి 490 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.

శ్రీమఠంలో ప్రముఖ సినీ గాయకులు మనో

ప్రజాశక్తి - మంత్రాలయం

ఆలయ ప్రాంగణంలో ఉన్న మనో

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని ప్రముఖ గాయకులు మనో సతీసమేతంగా దర్శించుకున్నారు. మంగళవారం దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వారికి శేషవస్త్రం, ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. వైసిపి నాయకులు జి.జనార్ధన్ రెడ్డి ఉన్నారు.

ఎర్రబాడులో అగ్నిప్రమాదం

- గుడిసె దగ్ధం

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని ఎర్రబాడు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధమైంది. గ్రామస్తుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన కమ్మరి శ్రీనివాసులు గుడిసెలో మంగళవారం విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం సంబంధించి గుడిసె పూర్తిగా కాలిపోయింది. స్థానికులు గుర్తించి మంటలు ఆర్పేలోపు గుడిసెలో శ్రీనివాసులు నిల్వ ఉంచుకున్న తిండి గింజలు, పత్తి, ఆముదాలతో పాటు విలువైన పత్రాలు దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదంతో సర్వం కోల్పోయిన తనను ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని బాధితుడు కోరారు.

కాలిపోయిన గుడిసె

చెక్కును అందజేస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం : టిడిపి

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మంత్రాలయంలోని ఓ ప్రయివేట్ వసతి గృహంలో రచ్చుమర్రి గ్రామానికి పింజరి చిన్న ఉసేనికి మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ... పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. పన్నగ వెంకటేష్ స్వామికి చిన్న ఉసేని పూలమాలలు వేసి సన్మానించారు. టిడిపి నాయకులు చిన్న సుంకప్ప, ఏబు, వట్టెప్పగారి నరసింహ, సున్నం రఘు, విద్యా కమిటీ ఛైర్మన్ సున్నం గురురాజ్, రామయ్య, గోవిందు, వన్నూరు పాల్గొన్నారు.

'మానసిక ఒత్తిడికి గురిచేయొద్దు'

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

సెలవు రోజుల్లో కూడా విధులు నిర్వర్తించాలని ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేయవద్దని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జనార్ధన్, చిన్న సుంకన్న ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం వారు మాట్లాడారు. నిర్బంధ చదువుల వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులకు మానసిక ఒత్తిడి ఎక్కువై మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. సెలవు రోజులు, ఆదివారాలు కూడా 10వ తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు.

'ప్రమాదానికి గురికాకుండా చూడాలి'

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని మున్సిపల్ రోడ్డులో విద్యార్థులు ప్రమాదాలకు గురికాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి దస్తగిరి, అధ్యక్షులు శ్రీకాంత్ కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ నాసిర్ హుస్సేన్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ... పట్టణంలో మున్సిపల్, నెహ్రూ మెమోరియల్ స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం మరో గేటు ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణ నాయకులు మోహన్ పాల్గొన్నారు.

నేమకల్లులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

- ఎడిఎ చెంగల్ రాయుడు

ప్రజాశక్తి - చిప్పగిరి

రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పు శనగ పంట లో సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపా డుకోవాలని ఎడిఎ చెంగల్ రాయుడు సూచించారు. మంగళ వారం నేమకల్లు సచివాలయ కార్యాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ మనోహర్ ఆధ్వర్యంలో పలు పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో అధిక శాతం పప్పు శనగ పంటను సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం పైరు పూత, పింజ దశలో ఉందని తెలిపారు. ఈ సమయంలో పంటకు భూమి నుంచి వచ్చే తెగుళ్లు సోకి నష్టం కలిగిస్తాయన్నారు. పంట సంరక్షణకు తగిన సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. ఒకే పంట విధానానికి స్వస్తి పలకాలని, రసాయనిక ఎరువులు వాడకం కూడా పూర్తిగా తగ్గించాలని తెలిపారు. అనంతరం సంగాల గ్రామంలో 'పొలంబడి' నిర్వహించారు. ఎఇఒ రమాదేవి, రెవెన్యూ కార్యదర్శి వన్నూరు, ఆత్మ అధికారి మధు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రతాప్ నాయుడు పాల్గొన్నారు. **కోసిగి** మండలం సజ్జలగూడెం గ్రామంలో 'ధర్తీ బచావో నిగ్రాని సమితి', 'పొలం పిలు స్తోంది' నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్.అయుబ్ బాష, పంచా యతీ కార్యదర్శి వినోద్ నాయక్, గ్రామ పెద్దలు ఎస్.మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

ఓర్వలేకనే అసత్య ఆరోపణలు

- మార్కెట్ యార్డు ఛైర్మన్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఆస్పరి

మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

తన ఎదుగుదలను చూసి ఓర్వలేకనే తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన స్వగ్రామమైన బిల్లేకల్లులో 212 సర్వే నెంబర్‌లోని 6 సెంట్ల స్థలం 2012లో రిజిస్ట్రేషన్ అయిందని, తనపై అధికారులకు ఫిర్యాదు చేసిన వసంత రాయుడు కుటుంబం గతంలోనే అక్కడ ఉన్న స్థలాన్ని ఇతరులకు విక్రయించారని తెలిపారు. అధికారులను తప్పుదోవ పట్టిస్తూ వసంత రాయుడు కలెక్టర్‌ను కలవడం తగదన్నారు. గ్రామంలోని తన ప్రత్యర్థులైన ఇద్దరు వ్యక్తులు సంజీవ రాయుడును తప్పుదోవ పట్టిసున్నారని, వైసిపి నాయకుడు హనుమంతు రెడ్డి శివాలయం స్థలంలో అక్రమంగా ఇల్లు నిర్మించుకొని అమ్ముకున్నారని విమర్శించారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఇబ్బందులకు గురిచేసి తమ కుటుంబంపై తప్పుడు కేసులు పెట్టారన్నారు. తాను ఎప్పుడూ అవినీతికి పాల్పడ లేదన్నారు. టిడిపి కోసం పని చేసినట్లు, సేవలను గుర్తించి అధిష్టానం, టిడిపి ఇన్‌ఛార్జ్ వైకుంఠం జ్యోతి తనకు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవిని ఇచ్చారన్నారు. హనుమంతు రెడ్డి, అట్టేకల్లు బాబు తనపై ఆరోపణలు మానుకొని మంచి ఆలోచనలతో ముందుకెళ్లాలని హితవు పలికారు.

IN THE COURT OF PRINCIPAL DISTRICT JUDGE :: KURNOOL
A.S. NO.125/2019

J.K. Manoranjan Bai & 3 others. ...Appellants

Vs

1. B.T. Mahesh Singh s/o late Kamal Singh, (R2)
2. J.K. Joshila Bai w/o late J.K. Babu Singh, (R4)
3. J.K. Tejas Singh s/o late J.K. Babu Singh, (R5)

All are Hindus, R/O H.No.3-188, Bairmal Street, Nandyal Town & Mandal & District & others. ...Respondents

NOTICE

Where as the Appellants filed the above Appeal against the Respondents seeking to set aside the lower court decree and partition the plaint schedule property and you are hereby directed to appear before this Hon'ble Court or through an Advocate on your behalf and file the counter with documents on 31-12-2025 at 10.30 A.M. without fail otherwise the matter will be settled, in your absence, by this Hon'ble Court.

K.Uma Hanumantha Rao
ADVOCATE,
KURNOOL.
Cell : 9440244246

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE KURNOOL
A.S. No.22/2025

S.Venkatalakshmi. ...Appilent

VERSUS

P.Sarala@ Bujamma and others. ...Respondents

NOTICE TO RESPONDENT 4,6,8,9

4) ఎస్.ఆనంద్ బాబు తండ్రి పరశురామయ్య ఇంటి నెం.87/174-1, మేడపైన, శ్రీ లక్ష్మీ నగర్, బి.క్యాంపు, కర్నూలు.
6) ఎస్.వరలక్ష్మి భర్త శ్రీనివాసులు ఇంటి నెం.87/174, శ్రీ లక్ష్మీ నగర్, సి.క్యాంప్, కర్నూలు.
8) ఆర్.లక్ష్మీదేవి భర్త సత్యనారాయణ ఇంటి నెంబర్ 87-391-2, రవీంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఎదురుగా, మాధవనగర్, బి.కాంప్, కర్నూలు
9) ఎస్.పద్మ భర్త నాగరాజు ఇంటి నెం.87-174, గ్రౌండ్ ఫ్లోర్, శ్రీ లక్ష్మీ నగర్, బి.క్యాంప్, కర్నూలు.

పై నెంబర్ అప్పీల్ లో అప్పిలెంట్ (అర్జిదారు) కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కర్నూలు ఐ.పి 39/2020, 27.09.2022 తేదీన ఇచ్చిన తీర్పు మేరకు అప్పీలు దాఖలు చేసినది. ఇందులో 4,6,8,9 రెస్పాండెంట్లు అయిన మీకు అక్షేపణ ఉన్న7-1-2026 తేదీన పగలు 10:30 గంటలకు పై కోర్టుల హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఎస్.చంద్రశేఖర్,
బి.నాగలక్ష్మి దేవి,
అప్పిలెంటుపరం అడ్వకేట్లు,
కర్నూలు.

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

సమాన పనికి సమాన వేతనమివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

శ్రీశైలం మండలం సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. ముందుగా ఆల్ ఇండియా సిఐటియు 18వ మహాసభల కరపత్రాలను ఆస్పత్రి ఎదుట మంగళవారం ఆవిష్కరించారు. ఆస్పత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులతో యూనియన్ అధ్యక్షురాలు బెజవాడ మరియమ్మ అధ్యక్షత మంగళవారం సమావేశం నిర్వహించారు. సిఐటియు శ్రీశైలం మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు, సిఐటియు నంద్యాల జిల్లా నాయకులు మునిపాటి చిన్న మారెన్నలు మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకి కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, నిత్యావసర ధరల పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇపిఎస్, ఇఎస్ఐ వర్తింపజేయాలని, ప్రతి నెల వేతనాలు చెల్లించాలన్నారు. సమావేశంలో పారిశుధ్య కార్మికులు జె లక్ష్మీనారాయణమ్మ, పప్పుల సుబ్బలక్ష్మి, బుదాల కళావతి, వాసం లక్ష్మి, సిహెచ్ సునీత, విశ్రాంతమ్మ, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఉపాధ్యాయ క్రీడా పోటీల్లో ఎమ్మెల్యే కోట్ల

ప్రజాశక్తి - బేతంచర్ల

క్రీడలు ఆడడంతో ప్రతి ఒక్కరికీ మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్ గ్రామంలో మండల స్థాయి ఉపాధ్యాయ క్రీడా పోటీలను ఎంఇఒ జి సోమశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరై ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి హాజరై మాట్లాడారు. ఆటలు ఆడడంతో ప్రతి ఒక్కరికీ మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని, ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం, యోగ, ఎవరికి సామర్థ్యం తగిన క్రీడలు ఆడుతూ ఉంటే అన్ని రకాల వ్యాధులను అరికట్టి ఆరోగ్యంగా జీవించడానికి దోహదపడతాయని సూచించారు. అనంతరం బుగ్గన ప్రసన్న లక్ష్మి మహిళా ఉపాధ్యాయులకు వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, సింగిల్ విండో అధ్యక్షులు చంద్రశేఖర్ చౌదరి, మాజీ ఎంపీటీసీ జాకీరుల బేగ్, వాసు, రామనాథం, డాక్టర్ మస్తాన్, సుబ్బరాయుడు, అంజాద్ బాష, సయ్యద్, వెంకటేశ్వర్ రెడ్డి, నాగరాజు, రమేష్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా కోసం.. హైవేపై రైతుల ఆందోళన

ప్రజాశక్తి - ఆత్మకూరు

విద్యుత్ సరఫరా కోసం ఆత్మకూరు మండలం, కరివేన గ్రామం వద్ద నేషనల్ హైవే రోడ్డుపై కరివేన గ్రామానికి చెందిన రైతులు మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తమ పొలాలకు విద్యుత్ సరఫరా కావడం లేదంటూ రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండిపోయే స్థితిలో ఉన్నాయన్నారు. నీరు ఉన్నప్పటికీ విద్యుత్ లేకపోవడంతో ఇబ్బందికి గురవుతున్నామని, తప్పని పరిస్థితుల్లో ఆందోళనకు దిగాల్సిన వస్తుందన్నారు. ఆందోళనతో కర్నూల్ నుండి విజయవాడ వెళ్లే నేషనల్ హైవేపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన విరమించేది లేదని అన్నదాతలు భీష్మించి కూర్చున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఘనంగా చర్చి ప్రతిష్టాపన వార్షికోత్సవం

సందేశమిస్తున్న బిషఫ్ చాగలమర్రి పోటో 9. పాల్గొన్న క్రైస్తవ సోదరిమణులు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామంలో చర్చి 133వ ప్రతిష్ట వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ప్రతిష్ట ఆరాధనలు ముత్యాలపాడు డీనరీ చైర్మన్ రెవరెండ్ జీవి చంద్రశేఖర రావు అధ్యక్షతన నిర్వహించారు. నంద్యాల అధ్యక్ష ఖండపు బిషప్ రైట్ రెవరెండ్ సంతోష్ ప్రసన్న రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవితాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నంద్యాల అధ్యక్ష ఖండపు పాలకవర్గం వైస్ ప్రెసిడెంట్ రాజేంద్ర బాబు, రెవరెండ్ నందం ఐజేక్, రెవరెండ్లు ఐజిక్ ప్రసన్న రావు అనిల్, సంపత్, చెంచుల రవీంద్రనాథ్, బెంజిమెన్, రవికుమార్, సువార్తయ్య జక్కం స్టాండ్లీ, ఇతర మత గురువులు, సంఘ కాపరి కామిరెడ్డి ప్రసన్నకుమార్, సంఘ పెద్దలు సంఘము పాల్గొన్నారు.

వికలాంగులకు దుస్తులు పంపిణీ

వికలాంగులకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు.

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు బాబురావు కుమార్తె బహుళశ్రీ, సాయికృష్ణ దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా వికలాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ గెలివి సహదేవుడు అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్ధన్, వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రమణయ్య, చంద్రమోహన్, పోసిన సుబ్బారావు, కన్నయ్య, సందీప్, మేడం చంద్రశేఖర్, రామయ్యలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఒక్కసారి దానికి బానిస అయితే జీవితం అంధకారం అవుతుందని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కంకర గుర్రెడ్డి జూనియర్ కళాశాలలో జెకెఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేసి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వర రెడ్డి, చెన్నయ్య, మహమ్మద్ అలీ, వెంకట రమణ, విద్యార్థులు పాల్గొన్నారు

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - ఆత్మకూరు

బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి అమలాపురం గూడెంటోని ప్రతి ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎసిఎం 5శాతం ద్రావణాన్ని పిచికారి చేసినట్లు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ చంద్ర శేఖర రావు, సబ్ యూనిట్ అధికారి కృష్ణారెడ్డిలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడంతో దోమలను నిర్మూలించవచ్చని, తద్వారా దోమకాటు ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టవచ్చని గూడెం వాసులకు అవగాహన కల్పించారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆరోగ్య కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు విశ్వనాథ్, భాస్కర్ పాల్గొన్నారు.

మలేరియా, డెంగీపై అవగాహన కల్పించండి.. కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు ఆయన సూచించారు. బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన 'ఆశా డే'కు ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి శుక్రవారం వారం ఫ్రైడే-డ్రైడేను పకడ్బందీగా నిర్వహించి ఎన్‌డిసిడి సర్వే చేపడితే వ్యాధులను ముందుగానే గుర్తించవచ్చని సూచించారు. మధ్య కాలంలో విస్తరిస్తున్న స్క్రబ్ టైఫస్ వ్యాధి గురించి, లక్షణాల గురించి ఆశాలకు వివరించారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. కార్యక్రమంలో బైర్లూటి వైద్యాధికారి డాక్టర్ పవన్ కుమార్, సిహెచ్ఒ కుద్దూస్ బాష, సూపర్వైజర్ రవణమ్మ, సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పగిడ్యాల

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఇఒ సుభాన్, సిడిపిఒ మంగవల్లి, ఎంపిడిఒ సుమిత్రమ్మ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహంపై కెజిబివి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. ఆడపిల్లలు బాగా చదువుకొని మంచి ఉన్న స్థానానికి ఎదగాలన్నారు. 18-21 ఏళ్ల తర్వాత వివాహం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలను వ్యతిరేకించాలని విద్యార్థినిలకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అనీల్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శేషమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మిడతూరు : అందరం కలిసికట్టుగా బాల్య వివాహాలను అరికడదామని అంగన్వాడీ సూపర్వైజర్లు వరలక్ష్మి, రేణుకాదేవి అన్నారు. స్థానిక కెజిబివి పాఠశాలలో మంగళవారం నిర్వహించిన బాల్య వివాహ రహిత కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థినిలు విద్య ప్రాముఖ్యత, అలాగే ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. అలాగే చట్టంలో చైల్డ్ ప్రొటెక్షన్, బాల్య వివాహాలు చేసేటప్పుడు వాటిని ఎలా అరికట్టాలని, వారికి విధించే శిక్షల గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో కలిగే నష్ట కష్టాలను కళారూపాల ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒ పైజునిష, శ్రీనివాసులు, మంగవల్లి, కేజీబీవీ ప్రిన్సిపల్ విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిడుతూరు : సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

సిబ్బంది సమయపాలన పాటించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి -కోడుమూరు

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపిడిఒ ఎసి.రాముడు తెలిపారు. మంగళవారం మండలంలోని పులకుర్తి గ్రామంలో ఉపాధి హామీ చట్టం కింద మంజూరైన మినీ గోకులం షెడ్ నిర్మాణాలను ఎంపిడిఒ రాముడు పరిశీలించారు. పులకుర్తి గ్రామంలో రైతులు పశువులను సంరక్షించుకునేందుకు కట్టుకునే గోకులం షెడ్డు నిర్మాణాలను వేగవంతం చేసి ప్రభుత్వం ఇచ్చే లబ్ధి పొందాలని తెలిపారు. సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది సమయపాలన పాటించాలని, ఫీల్డ్ విజిట్‌కు వెళితే మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందుతుందా లేదా అని పర్యవేక్షణ చేస్తూ సెంటర్‌ను సక్రమంగా నిర్వహించాలని అంగన్వాడీలను ఆదేశించారు. పంచాయతీ పరిధిలో గృహ నిర్మాణ శాఖకు సంబంధించి గృహాలకు అర్హత కలిగిన వారిని చెక్ చేసే సందర్భంలో హౌసింగ్ డిఇ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎంపిడిఒ ఇల్లు తిరిగి వెరిఫికేషన్ చేశారు. కళ్లపరి సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది సమయపాలన, అటెండెన్స్, సర్వేల గురించి ఆరా తీశారు. పులకుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని సందర్శించారు.

మినీ గోకులం షెడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి : డిపిఎం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎన్ఎంఎన్ఎఫ్ కార్యక్రమం కింద ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేయడానికి రైతుల్లో అవగాహన పెంచాలని డీపీఎం శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో రబీ సీజన్‌లో పాలీక్రాపింగ్ (రబీ డ్రై సోయింగ్) అమలును విస్తరించడానికి ఉన్నత స్థాయి క్యాడర్‌లు ఎంటిలు, ఎల్-1, 2, 3లకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం జిల్లా ప్రాజెక్టు నిర్వహణ విభాగం కార్యాలయంలో మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో ఆర్‌వైఎస్ఎస్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ తల్లం ఆన్‌లైన్‌లో జిల్లా వ్యాప్తంగా ఎన్ఎంఎన్ఎఫ్ అమలు జరుగుతున్న విధానం, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ రైతుల అవగాహనా లో మార్పులు, ఉర్వి యాప్ లో నమోదు, రైతన్నకు ప్రతి ఎకరా నుండి కనీసం నెలకు రూ.25 వేలు ఆదాయం వచ్చే విధానాలు, రసాయన వ్యవసాయం చేసే రైతుల లందరిని ప్రకృతి వ్యవసాయంలోకి మార్చడానికి ప్రణాళిక చేసుకోవడం, అలాగే క్యాడర్ ప్రతి లెవెల్‌లో విజయవంతం గా నిలిచి రైతులందరికి ఆదర్శంగా వుండే వంటి అంశాలపై సమగ్ర మార్గనిర్దేశం చేశారు. శిక్షణలో డిపిఎం, ఎడిపిఎం, ఎన్ఎఫ్ఏలు, ఎంటిలు, యూనిట్ ఇంచార్జిలు, ఐసిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీపీఎం శ్రీనివాసులు

ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - నంద్యాల

మండలంలోని ఎన్. కొత్తపల్లె గ్రామంలో ఉన్న శ్రీ శారదా విద్యాపీఠం పాఠశాలలో నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు వివిధ ఆరోగ్య అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐఎంఏ మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీ సౌజన్య మంచి అలవాట్ల గురించి తెలిపారు. డాక్టర్ గింజుపల్లి అనూష ఆరోగ్య కరమైన ఆహార అలవాట్లపై, మంచి స్పర్శ, చెడుస్పర్శలపై డాక్టర్ తనూజ, విద్యార్థులపై మొబైల్, సోషల్ మీడియా ప్రభావం అన్న అంశంపై డాక్టర్ శశి కిరణ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానాచార్యులు శ్రీదేవి పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను రద్దు చేయాలి : వైసిపి

ప్రజాశక్తి -నంద్యాల కలెక్టరేట్

మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని ఉపసంహరించుకోవాలని వైసిపి నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ పత్రాలను బుధవారం ఉదయం 10 గంటలకు వైసీపీ జిల్లా కార్యాలయంలో సేకరించి 15వ తేదీన కేంద్ర కార్యాలయానికి పంపుతామన్నారు. 17వ తేదీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో వైసిపి నేతలతో కలిసి రాష్ట్ర గవర్నర్‌కు కోటి సంతకాల సేకరణ పత్రాలను అందజేసి మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ విధానాన్ని రద్దు చేయాలని ప్రజల తరుపున వచ్చిన వ్యతిరేకతను తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని తమ సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పిపి నాగిరెడ్డి, దేశం సుధాకర్ రెడ్డి, రామలింగారెడ్డి, సాయినాథరెడ్డి, మహిళా విభాగం జనరల్ సెక్రటరీ శశికళారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ దేవనగర్ బాష, కౌన్సిలర్ సమ్మద్ డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పింఛన్ ఇచ్చి ఆదుకోండి మహాప్రభో...

దివ్యాంగుడైన శివరామిరెడ్డి

ప్రజాశక్తి - చాగలమర్రి

వికలాంగ పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని ముత్యాలపాడు గ్రామానికి చెందిన గడ్డం శివరామిరెడ్డి అధికారులను వేడుకుంటున్నాడు. వివరాలు.. మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన గడ్డం శివరామిరెడ్డికి షుగర్ వ్యాధితో కుడి కాలికి ఏడాదిన్నర క్రితం గ్యాంగ్రీన్ సోకి వైద్యులు కాలును మోకాలి వరకు తొలగించారు. దీంతో భాదిత శివరామిరెడ్డి సదరం క్యాంపునకు వెళ్ళగా వైద్యులు 73ః శాతం వికలత్వం నమోదు చేసి, సర్టిఫికెట్ను మంజూరు చేశారు. అయితే ప్రభుత్వం అందజేస్తున్న వికలాంగుల సాంఘిక సంక్షేమ పింఛన్‌ను అధికారులు మంజూరు చేయలేదు. అరకొరగా ఉన్న కొద్దిపాటి భూమిని ఇద్దరు కూతుర్ల పెళ్ళిళ్ళకు, అతని చికిత్సకు విక్రయించారు. ప్రస్తుతం భార్య కూలీ పనికి వెళితే తప్పా పూట గడవని పరిస్థితి ఉంది. షుగర్ వ్యాధి కంట్రోల్ కాకపోవడం వలన, ఏడమ కాలికి కూడా గ్యాంగ్రిన్ సోకి పాదానికి గాయం కావడంతో చికిత్స పొందడానికి ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నామని బాధితుడి భార్య గడ్డం శ్రీలత బోరున విలపిస్తోంది. ఇప్పటికైనా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి వికలాంగ పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మద్దికెర

సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు రాముడు కోరారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులను బానిసలుగా చేసే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు.

చిన్నారి గొంతులో ఇరుక్కున్న రూ.2 నాణెం తొలగింపు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

చిన్నారి గొంతులో ఇరుక్కున్న రూ.2 నాణేన్ని మెడికవర్ వైద్యులు విజయవంతంగా తొలగించారు. చిన్నారి లాస్య రూ.2 నాణెం నోట్లో పెట్టుకుని స్కూల్‌లో ఆడుకుంటుండగా గొంతులో దిగిపోయి ఇరుక్కుపోయింది. తల్లిదండ్రులు ఆమెను మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. డాక్టర్ అబ్దుల్ సమద్ ఎండోస్కోపి సహాయంతో శస్త్ర చికిత్స అవసరం లేకుండా నాణేన్ని సురక్షితంగా బయటకు తీశారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించిన డాక్టర్ సింధూరా, డాక్టర్ వై.గణేష్ సమన్వయంతో చిన్నారి త్వరగా కోలుకునేలా సహకరించారు. మంగళవారం మెడికవర్ హాస్పిటల్స్ క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు చేరువైన ధరల్లోనే చికిత్స అందించడం తమ బాధ్యత అని తెలిపారు.

సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు



ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలను మంగళవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కర్నూలులో ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు కేక్ కట్ చేశారు. కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రీ పాషా, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమన్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్‌సి.బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా ఛైర్మన్ డివి.సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా ఛైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎ.సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు సిపిఐ ఆధ్వర్యంలో నిరసనలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రైతు సమస్యలు పరిష్కరించాలని బుధవారం జిల్లావ్యాప్తంగా జరిగే నిరసనలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కోరారు. మంగళవారం నగరంలోని సిఆర్ భవన్‌లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్ బాబుతో కలిసి సమావేశంలో మాట్లాడారు. ఆస్పరిలో జరిగే రోడ్డు దిగ్బంధనం నిరసనలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారని తెలిపారు.

మైపర్ ఉద్భవ్ గోడపత్రిక విడుదల

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని ఎ.క్యాంపులో ఉన్న మైపర్ ఫార్మసీ కళాశాలలో మైపర్ ఉద్భవ్-2025 గోడపత్రికను కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్ విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ... ఈనెల 16, 17వ తేదీన మైపర్ ఫార్మసీ కళాశాలలో స్పోర్ట్స్, కల్చరల్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, అమ్మాయిలకు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపల్ ఎం.రాజ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రివిలేజ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో నిర్వహించిన సమావేశానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. పలు సమస్యలపై చర్చించామని ఎమ్మెల్యే బొగ్గులు దస్తగిరి పేర్కొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన అరుణమ్మ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

టిడిపి రాష్ట్ర సీనియర్ నాయకులు అరుణమ్మ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె మహిళలకు పార్టీలో తగిన అవకాశాలు కల్పించాలని కోరారు.

అవినీతి నిర్మూలనకు కృషి

- శ్రీ రామకృష్ణ కళాశాల డైరెక్టర్ జి హేమంత్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీ రామకృష్ణ కళాశాల డైరెక్టర్ జి హేమంత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ అవినీతి దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కళాశాల డైరెక్టర్ జి.హేమంత్ రెడ్డి హాజరై మాట్లాడారు. సభాధ్యక్షులుగా కరుణ, ప్రత్యూష, వ్యవహరించారు. కార్యక్రమంలో మోహన్ రావు పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణంలో కళాశాల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి : ఏఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె

గోడౌన్‌లో నడుస్తున్న ఎస్సీ కళాశాలల హాస్టల్‌ను పట్టణంలో ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎర్రి స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ హాస్టల్ పట్టణానికి దూరంగా ఉండడం వల్ల విద్యార్థులు కళాశాలలకు వెళ్ళడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నియోజకవర్గంలో ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు సొంత భవనం లేకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే సొంత భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌కు కమాటి, వాచ్మెన్ రెగ్యులర్ వర్కర్లను నియమించాలన్నారు. హాస్టల్ సమస్యలపై జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారులు స్పందించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు మాథష్, నాయకులు రాహుల్, శీలన్న, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు